ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 06.03.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణ ప్రారంభమైంది.

2. ఆర్టీసీ బస్సులకు మహిళలను యజమానులను చేయడం వంటి వినూత్న కార్యక్రమాలతో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు కృషి చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

3. కేరళ ఎన్నికల ప్రచారం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజాధనాన్ని ప్రకటనల రూపంలో ధారపోస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు.

4. తెలంగాణ నూతన గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లాను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశాలు జారీ చేశారు.

5. ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్ రెండో సెమీ ఫైనల్‌లో ఇంగ్లండ్‌పై 7 పరుగుల తేడాతో గెలిచిన భారత్ ఘనంగా ఫైనల్‌కు చేరుకుంది.

**'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణ నేటి నుంచి ప్రారంభమై జూన్ 12 వరకు కొనసాగనుంది. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా మూడోసారి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో

భాగంగా గ్రామ, వార్డు సభలు నిర్వహించనున్నారు. పది వారాల పాటు వారానికో ప్రత్యేక శాఖకు కేటాయిస్తూ గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యం, సంక్షేమం, రైతు హితం, మహిళా సాధికారత వంటి అంశాలపై వారోత్సవాలు చేపడతారు. ఈ ప్రణాళికలో భాగంగా లక్ష మంది యువతకు ఉపాధి కల్పించేలా అన్ని జిల్లాల్లో ఉద్యోగ మేళాలు నిర్వహించడంతో పాటు, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ దస్త్రాలను పరిష్కరించనున్నారు. ఇందిరా మహిళాశక్తి పథకం కింద కొత్త భవనాల ప్రారంభం, వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు అందించడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. సర్పంచ్ స్థాయి నుంచి ఎంపీల వరకు ప్రజాప్రతినిధులందరినీ భాగస్వాములను చేస్తూ, వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేసి పథకాలపై అవగాహన కల్పిస్తారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ముందస్తు ఉత్సవంగా భావిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్లు, ఉన్నతాధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

డెస్క్

**పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్ జిల్లా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా మసాబ్ ట్యాంక్ చాచా నెహ్రూ పార్క్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నగరంలోనే మొట్టమొదటి అద్దాల లైబ్రరీని, ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాన్ని, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను పొన్నం ఆవిష్కరించారు. అలాగే మహిళా సంఘాలకు 35 కోట్ల రూపాయల సున్నా వడ్డీ రుణాల చెక్కును పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వార్డుల నుంచి రాజధాని వరకు ఈ 99 రోజుల ప్రణాళిక నిరంతరం కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఎదగాలని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్, సన్నబియ్యం, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా సెట్విన్ ద్వారా కుట్టు మిషన్ల పంపిణీ, ఆర్టీసీ బస్సులకు మహిళలను యజమానులను చేయడం వంటి వినూత్న కార్యక్రమాలతో ప్రభుత్వం మహిళా సాధికారతకు కృషి చేస్తోందని మంత్రి పొన్నం

ప్రభాకర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బలమూరి వెంకట్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పిటిసి, హైదరాబాద్

**పొంగులేటి**

రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పేరిట 99 రోజుల కార్యాచరణ చేపడుతున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ఈరోజు మంత్రి ఖమ్మంలో ప్రజా ప్రతినిధులు, అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కొత్తగా ఎన్నుకున్న సర్పంచులు, వార్డు మెంబర్లకు ఈ కార్యక్రమం గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి 10 థీమ్స్ 99 రోజుల కార్యాచరణను ప్రకటించిన అంశాలను మంత్రి వివరించారు. పౌర సేవలు, ప్రజల అవసరాలతో మమేకమై ఉండే అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పిటిసి, ఖమ్మం

**వనపర్తి జిల్లా కలెక్టర్**

వనపర్తి జిల్లాలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి లాంఛనంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా అంబేద్కర్ చౌరస్తా నుంచి పాలిటెక్నిక్ కళాశాల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత, సామూహిక పరిశుభ్రతను విధిగా పాటించాలని, అలాగే దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న దస్త్రాలను అధికారులు వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

బైట్- Collector Adarsh Surabhi

పిటిసి, వనపర్తి

**సంగారెడ్డి కలెక్టర్**

సంగారెడ్డి జిల్లాలో నేటి నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు సాగే 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'పై కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులతో సమీక్షించారు. ఈ ప్రణాళికలో భాగంగా మార్చి 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ఫైళ్ల పరిష్కారంపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఏప్రిల్ నెలలో ఆరోగ్యం, రహదారి భద్రత, సంక్షేమ పథకాల లబ్ధిపై గ్రామ సభల్లో అవగాహన కల్పించనున్నారు. మే మాసంలో చిన్నపిల్లల సంరక్షణ, డ్రగ్స్ రహిత సమాజం, వ్యవసాయం, విద్యా రంగాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉగాది నాటికి, అలాగే జూన్ 2 నాటికి సామూహిక ఇందిరమ్మ గృహ ప్రవేశాలకు లబ్ధిదారులను సిద్ధం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

పిటిసి, సంగారెడ్డి

**హరీష్ రావు**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేరళ ఎన్నికల ప్రచారం కోసం తెలంగాణ ప్రజాధనాన్ని వందల కోట్ల రూపాయల ప్రకటనల రూపంలో ధారపోస్తున్నారని ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి మహాలక్ష్మి కింద నెలకు 2 వేల 500 రూపాయలు, తులం బంగారం, స్కూటీలు వంటి హామీలను తుంగలో తొక్కారని మాజీ మంత్రి ధ్వజమెత్తారు. ఇక్కడ నిరుద్యోగులపై లాఠీచార్జీలు చేస్తూ, కేరళ పత్రికల్లో మాత్రం లక్షలాది ఉద్యోగాలు ఇచ్చామంటూ అబద్ధపు ప్రచారం చేసుకుంటున్నారని హరీష్ రావు విమర్శించారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, బోనస్ వంటివి అమలు చేయడంలో విఫలమై, ఇతర రాష్ట్రాల్లో తమది అద్భుత పాలన అని పబ్లిసిటీ చేసుకోవడం శోచనీయమని కూడా పేర్కొన్నారు. తెలంగాణ సంపదను కాంగ్రెస్ అధిష్టానం కోసం ఇతర రాష్ట్రాలకు మళ్లిస్తున్నారని ఆరోపిస్తూ, ప్రకటనల కోసం ఖర్చు చేసిన సొమ్మును కాంగ్రెస్ పార్టీ ఖాతా నుండే తిరిగి చెల్లించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

ప్రెస్ నోట్

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్**

విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేసే చదువుపై దృష్టి సారించగలుగుతారని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ తో కలిసి ప్రారంభించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ...

**BYTE ... COLLECTOR GARIMA**

**పిటిసి, రాజన్న సిరిసిల్ల**

**నిర్మల్ జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్**

నిర్మల్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు ప్రధానమంత్రి ఉపాధి సృష్టి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్ పిలుపునిచ్చారు. మ్యానుఫ్యాక్చరింగ్, సర్వీస్ సెక్టార్లలో కొత్త యూనిట్లను నెలకొల్పి ఉపాధి పొందేలా కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా భారీగా సబ్సిడీ అందిస్తోందని రామ్ గోపాల్ వివరించారు.

Byte ... రామ్ గోపాల్

పిటిసి, నిర్మల్

**తెలంగాణ నూతన గవర్నర్**

తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్‌గా సీనియర్ రాజకీయ నాయకుల, మాజీ కేంద్ర మంత్రి శివ ప్రతాప్ శుక్లా నియమితులయ్యారు. ఇప్పటి వరకు హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా సేవలు అందించిన ఆయనను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలంగాణకు బదిలీ చేశారు. ఆయన జిష్ణు దేవ్ వర్మ స్థానంలో పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని రుద్రాపూర్‌లో 1952 ఏప్రిల్ 1న జన్మించిన శివ ప్రతాప్ శుక్లా, గోరఖ్‌పూర్ యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు. 1970లో ఏబీవీపీ ద్వారా విద్యార్థి నాయకుడిగా ప్రస్థానం ప్రారంభించి, ఎమర్జెన్సీ

కాలంలో మీసా చట్టం కింద 19 నెలలు జైలు శిక్ష అనుభవించారు. అనంతరం బీజేపీలో చేరి గోరఖ్‌పూర్ అర్బన్ నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. యూపీ ప్రభుత్వంలో పలు శాఖలకు మంత్రిగా, అలాగే 2017-2019 మధ్య కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా విశేష సేవలు అందించారు. ఆ తర్వాత 2023 ఫిబ్రవరిలో హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు తెలంగాణ గవర్నర్ గా నియమితులయ్యారు.

డెస్క్

**బ్రహ్మోత్సవాలు**

జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా దక్షిణ దిగ్యాత్ర వేడుక నిన్న రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. దేశంలో మరెక్కడా లేని విధంగా, ఇక్కడ స్వామివారు ఏటా పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీసు అధికారుల నుంచి పూజలందుకోవడం దశాబ్దాలుగా వస్తున్న ఆనవాయితీ. బ్రహ్మోత్సవాల సందర్భంగా ధర్మపురి ఠాణాకు విచ్చేసిన యోగానంద, ఉగ్ర నరసింహస్వాములకు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ అరుదైన సంప్రదాయంలో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని రఘుచందర్ పేర్కొన్నారు. ఈ వేడుకలో పోలీసు సిబ్బందితో పాటు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

బైట్ ... డీఎస్పీ రఘుచందర్

పిటిసి, జగిత్యాల

**టీ20 ప్రపంచకప్**

ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్‌లో ఇంగ్లండ్‌పై 7 పరుగుల తేడాతో గెలిచిన భారత్ ఘనంగా ఫైనల్‌కు చేరుకుంది. ఆదివారం అహ్మదాబాద్‌లో న్యూజిలాండ్‌తో జరిగే టైటిల్ పోరుకు భారత్ సిద్ధమైంది.

ఎన్.ఎస్.డి